పి. బజోవ్

వెండి గిట్ట

అనిల్

పి. బజోవ్

వెండి గిట్ట

అనువాదం: ఆర్వియార్

బొమ్మలు: ఎ. ప్లాక్‌సిన్

మంచి పుస్తకం

మా ఊళ్లో కోటయ్య అనే ఓ ముసలాయన ఉండేవాడు. అతనికి నా అన్న వాళ్లెవరూ లేరు. అందుకని ఓ అనాధని తెచ్చుకుని పెంచుకుందామని అనుకున్నాడు.

"మీ ఎరుకలో ఎవరైనా అనాధలున్నారా," అని అతను ఇరుగింటి వాళ్లనీ, పొరుగింటి వాళ్లనీ వాకబు చేశాడు.

"లేకేం. గండికోటలోని గంగయ్య పిల్లలు అనాధలైపోయారు. పెద్దపిల్లల్ని కుట్లు, లేసులు నేర్పే చోటకి మన ఊరి మునసబు పంపించాడు. చిన్నపిల్ల ఆరేళ్ల అమ్మాయి ఉండిపోయింది. ఆ పిల్లని ఎవళ్లూ తీసికెళ్లలేదు. నువ్వు ఆ అమ్మాయిని తెచ్చుకోవచ్చు," అని వాళ్లు చెప్పారు.

"కాని నాకు ఆడపిల్లవల్ల చెయ్యి ఆసరా ఉండదు. మగపిల్లవాడైతే బాగుంటుంది. వాడికి నా పని నేర్పుతాను. పెద్దయ్యాక నాకు సహాయపడతాడు. కాని ఆడపిల్లవల్ల ఏం లాభం?" అన్నాడు కోటయ్య.

అలా అన్నాడేగాని మళ్లీ దీనంతటి గురించి ఆలోచించాడు.

"గంగయ్య, సాధుశీలురాలైన అతని భార్య నాకు తెలుసు. కష్టపడి పనిచేసేవాళ్లు, మంచివాళ్లు. ఈ పిల్లకి వాళ్ల పోలికలు వస్తే ఫరవాలేదు. ఈ అమ్మాయిని చేరదీస్తాను. ఇంతకీ వస్తుందో, రాదో," అన్నాడు.

"ఆమె బతుకేం పూలపాన్పులా లేదయ్యోయ్," అని ఇరుగుపొరుగు వాళ్లు అతనికి చెప్పారు. "గంగయ్య ఇంటిని ఓ పేదవ్యక్తికి ఇచ్చాడు మునసబు. పెద్దయ్యేదాక ఈ అనాధపిల్లని చూడమని చెప్పాడు. కాని అతనికే కుచేల సంతానం ఉంది. వాళ్లకే ముద్దకి కటకటగా ఉంది. అతడి భార్య ఈ దిక్కూ మొక్కూలేని పిల్లను అస్తమానూ సతాయిస్తూనే ఉంటుంది. పిసరు మెతుకు విదపడానికి విసుక్కుంటుంది. పాపం పసిపిల్లే అయినా ఆమాత్రం అర్థం అవుతుంది. ఆ పిల్లకి బాధ తెలుసు. ఆ కొంపలోనుంచి బయటపడాలని అనుకుంటోంది. నువ్వెళ్లి అడుగు, నీతో వస్తుంది," అని చెప్పారు.

"సరే. నేను ఆ పిల్లతో మాట్లాడతాను," అన్నాడు కోటయ్య.

ఓ సెలవు రోజున అతను ఆ పిల్ల ఉంటున్న చోటుకి వెళ్లాడు. ఆ ఇంటి నిండా పెద్దా, చిన్నా బోలెడుమంది ఉన్నారు. ఓ చిన్నపిల్ల పొయ్యి పక్కన జేగురు రంగు పిల్లిని నిమురుతూ కూర్చుంది. ఆ పిల్లీ చిన్నగానే ఉంది. ఆ పిల్లి ఎంత సన్నగా, ఎడ్డిగా ఉందో చెప్పలేం. అసలు ఎవరైనా దాన్ని ఇంట్లో చేరదియ్యడం

ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ అమ్మాయి ఆ పిల్లిని నిమురుతూ ఉంటే అది గుర్ మంటోంది. దాని కూత ఇల్లంతా వినిపిస్తోంది.

కోటయ్య ఆ పిల్లకేసి చూసి, "గంగయ్య కూతురు ఈమేనా?" అని అడిగాడు.

"ఆ, ఆమే," అని ఇంటావిడ సణిగింది. "తను చాలదన్నట్టు మెడకో డోలులాగా ఆ పిల్లిపిల్ల ఒకటి. ఈ పిల్లిపిల్లను వదిలించుకోలేకుండా ఉన్నాం. అది మా పిల్లల్ని గీరుతూ, రక్కుతూ ఉంటుంది," అంది.

"మీ పిల్లలు దాన్ని ఏడిపిస్తున్నారేమో. ఆ పిల్ల దగ్గర బాగానే ఉందిగా," అన్నాడు కోటయ్య.

తర్వాత అతను ఆ పిల్లకేసి తిరిగి, "ఓ చిట్టి తారా, నాతో ఉంటావా?" అని అడిగాడు.

ఆ పిల్ల గుడ్లు అంత చేసి చూసింది.

"నా పేరు తార అని మీకెలా తెలుసు?"

"నీ పేరు నాకు తెలియదు. ఊరికే అలా పిలిచానంతే," అన్నాడతను.

"కాని మీరెవరు?" అని ఆ పిల్ల అడిగింది.

"ఓ వేటగాడిని. వేసవికాలంలో ఇసకను జల్లెడలో వడబోసి బంగారం దొరుకుతుందేమో చూస్తాను. శీతాకాలంలో అడవిలోకి వెళ్ళి మేక దొరుకుతుందేమోనని చూస్తాను. కాని దాని జాడైనా దొరకదు," అన్నాడు.

"దొరికితే దాన్ని కాల్చేస్తారా?"

"అబ్బే," అన్నాడు కోటయ్య. "నేను మామూలు మేకల్ని చంపుతాను. కాని దాన్ని కాదు. దాని ముందు కుడికాలు ఎక్కడ ఆన్చుతుందా అని చూస్తాను," అన్నాడు.

"ఎందుకు?"

"నాతో ఉండు. దాన్ని గురించి మొత్తం చెపుతాను," అన్నాడు కోటయ్య.

ఆ మేక గురించి వినాలని ఆ చిన్న పిల్లకి చాలా కోరికగా ఉంది. అతను [redacted] సరదా అయిన ముసలతనిలాగే కనిపించాడు. అందుకని ఆమె అతనితో "సరే వస్తాను. కాని ఈ పిల్లిపిల్లనీ నాతో తెచ్చుకుంటాను. చూడండి ఎంత మంచిదో ఇది," అంది.

“అయ్యొయ్యొ ఎందుకు మంచిది కాదు. చక్కగా పాడే ఇలాంటి పిల్లిని ఎవరు వదులుకుంటారు. ఇది మా ఇంట్లో హార్మోనియం అంత బాగుంటుంది,” అన్నాడు కోటయ్య.



ఇంటావిడ వాళ్ల మాటలు విన్నది. ఆ అనాధ పక్షి వదిలిపోతోందని సంతోషించింది. తార వస్తువుల్ని ఆమె గబగబా సర్దడం మొదలుపెట్టింది. కోటయ్య మనసు మార్చుకుంటాడేమోనని ఆమె భయం.

పిల్లి కూడా విషయం మొత్తం గ్రహించినట్టే ఉంది. అది వాళ్ల కాళ్లమీద రాసుకుంటూ

"అవును! స...స్స...రిగా ఉంది," అని గుర్‌మంది.

అలా అనాధపిల్లని కోటయ్య ఇంటికి తీసుకెళ్లాడు.

అతను పొడగరి, గడ్డం ఉంటుంది. ఆమె చిన్నది, చప్పిడి ముక్కు. వాళ్లిద్దరూ రోడ్డుమీద నడుస్తున్నారు. బురదకొట్టుకుని పిల్లి వాళ్ల వెనకాల ఈడ్చుకుంటూ వెళ్లింది.

ఆ రకంగా కోటయ్య, తార, పిల్లి కలిసి జీవించడం మొదలైంది. రోజులు గడుస్తున్నాయి. వాళ్లు ధనవంతులు కాలేదు కాని ఉన్నదాంతో ఏ లోటు లేకుండా, తిండికి లోపం లేకుండా గడుపుతున్నారు.

పొద్దున్నే కోటయ్య పనిలోకి వెళ్లేవాడు. తార ఇల్లు ఊడ్చి శుభ్రం చేసేది. అన్నం, కూర వండేది. పిల్లి ఎలుకల్ని వేటాడేది. సాయంత్రం ఇంటి దగ్గర హాయిగా, సరదాగా కలసి కాలక్షేపం చేసేవాళ్లు.

ముసలతను పిట్ట కథలు అద్భుతంగా చెప్పేవాడు. కథలంటే చెవి కోసుకునేది తార. పిల్లి గుర్‌మంటూ పడుకునేది,

"అవును... స...స్స...రిగా ఉంది," అంటూ.

కాని కథ అయిపోతూనే తార



“ఊ, ఇప్పుడు మేకని గురించి చెప్పు తాతా! ఎలా ఉంటుంది అది?” అని గుర్తుచేస్తూ అడిగేది.

మొదట్లో కోటయ్య తరవాత చెపుతాను అనేవాడు. కాని చివరికి చెప్పాడు.

“అది అలాంటి ఇలాంటి మేక కాదు. దాని పద్ధతే వేరు. దాని ముందు కుడి కాలుకి వెండి గిట్ట ఉంటుంది. ఒకసారి ఆ గిట్టతో నేలమీద తాటిస్తే ఒక వజ్రం అక్కడ ఊడిపడుతుంది. రెండుసార్లు తాటిస్తే రెండు వజ్రాలు వస్తాయి. నేలమీద ఆ గిట్టతో అది బరికితే, అబ్బో వజ్రాలు గుట్టగా పోగవుతాయి,” అని చెప్పాడు.

అతను చెప్పాడేగాని తరువాత ఎందుకు చెప్పానా అని నాలిక కరుచుకున్నాడు. ఏమంటే ఆ తరవాత తార మేకపిల్ల గురించి తప్ప దేన్నీ అడిగేది కాదు.

"తాతా, అది పెద్ద మేకా?"

అది బల్లకంటే ఎత్తు ఉండదని, దాని కాళ్లు సన్నగా ఉంటాయని, తల చక్కగా ఉంటుందని కోటయ్య చెప్పాడు.

"అయితే తాతా దానికి కొమ్ములు ఉన్నాయా?" అని తార అడిగేది.

"అయ్యో, లేకేం. చక్కని కొమ్ములు ఉన్నాయి. మామూలు మేకకి రెండు కొమ్ములే ఉంటాయి. కాని దీనికి జింక కొమ్ములున్నాయి, అయిదు చిలవల కొమ్ములు."

"అది ఏ జంతువునైనా తింటుందా, తాతా?"

"ఊహు, అది ఏ జంతువునీ తినదు. ఆకుల్నీ, గడ్డినీ తింటుంది. శీతాకాలంలో గడ్డి మేట్లల్లో ఉండే గడ్డిని కొంచెం కొరుకుతుంది."

"దాని రంగు ఎలా ఉంటుంది?"

"వేసవికాలంలో పిల్లిలాగా జేగురు రంగులో ఉంటుంది, శీతాకాలంలో వెండి తెలుపులో ఉంటుంది."

"అది వాసనకొడుతుందా?"

కోటయ్యకి కోపం వచ్చింది.

"పెంపుడు మేకలకి చెడ్డ వాసన ఉంటుంది. అది అడవి మేక. అందుకని దానికి అడవి గుబాళింపు ఉంటుంది," అని చెప్పాడు.

ఆకురాలే కాలం వచ్చింది. అడవిలోకి వెళ్లడానికి కోటయ్య తయారయ్యాడు. మేకలు మేత మేసే చోటు వెతకాలనుకున్నాడు. అప్పుడు తార బతిమాలటం, ప్రాధేయపడటం మొదలుపెట్టింది.

"నన్నూ నీతో కూడా తీసుకెళ్లు, తాతా! ఆ మేక ఎలా ఉంటుందో కనీసం దూరంనుంచైనా నేను చూస్తాను," అంది.



"దూరంనుంచి దానిని గుర్తించలేవు. ఆకురాలే కాలంలో అన్ని మేకలకీ కొమ్ములుంటాయి. ఎన్ని చిలవలు ఉన్నాయో నీకు తెలవదు. శీతాకాలంలో అయితే వేరు. మామూలు మేకలకి కొమ్ములుండవు. కాని వెండి గిట్ట మేకకి ఎప్పుడూ కొమ్ములుంటాయి. అప్పుడు దూరంనుంచైనా నీకు తెలుస్తుంది," అన్నాడు కోటయ్య.

అలా ఆమెని బుజ్జగించాడు. తార ఇంటి దగ్గర ఉండిపోయింది. కోటయ్య అడివిలోకి వెళ్లాడు.

అయిదో రోజున తిరిగివచ్చాడు.

"ఈ ఏడాది చాలా మేకలు మేతకి అడివి ప్రాంతాలకు వెళుతున్నాయి. ఈ శీతాకాలంలో అక్కడికి వెళతాను," అన్నాడతను.

"కాని శీతాకాలంలో అడవిలో ఎలా పడుకుంటావు?" తార అడిగింది.

"మనం గడ్డి కోతకి వెళ్లే లోయ దగ్గర ఒక చిన్న గుడిసె ఉందిలే. ఆ గుడిసె గట్టిగా ఉంటుంది. కిటికీ కూడా ఉంది. చలికి నెగడు ఉంది. అక్కడ బాగా ఉంటుంది నాకు," అన్నాడు.

అప్పుడు తార మళ్లీ మొదలుపెట్టింది:

"వెండి గిట్ట అక్కడ మేస్తుందా?"

"ఏమో ఎవరికి తెలుసు? మెయ్యొచ్చు."

అప్పుడు ఆ పిల్ల మళ్లీ బతిమాలటం, ప్రాధేయపడటం మొదలుపెట్టింది:

"నన్నూ నీతో తీసుకెళ్లు తాతా, నేను గుడిసెలో ఉంటాను. వెండి గిట్ట దగ్గరగా వస్తుందేమో చూడొచ్చు."

మొదట్లో ముసలాయన ఆ మాటలు చెవినపెట్టలేదు.

"చిన్నపిల్లని శీతాకాలంలో అడవిలోకి తీసుకువెళ్లడమా? మామూలుగా వెళ్లలేం, మంచుబండి మీద వెళ్లాలి. నీకు అది తెలియదు. మంచులో కూరుకుపోతావు. అప్పుడు ఏం చెయ్యాలి నీతో? గడ్డకట్టి ముద్దయిపోతావు," అన్నాడు.

కాని తార అతన్ని వదల్లేదు. బతిమాలుతూనే ఉంది.

"నన్నూ తీసుకెళ్లు, నన్నూ తీసుకెళ్లు తాతా! నేను మంచుబండి నడుపుతాను," అంది.

ఆ మాటలూ, ఈ మాటలూ చెప్పి చూశాడు కోటయ్య. ఆఖరికి అనుకున్నాడు:

‘ఈ అమ్మాయినీ కూడా తీసుకెళితే ఏమవుతుంది? ఓసారి అనుభవం అయితే మళ్లీ అడగదు.’

“సరే అయితే, తీసికెళతాను. అడవిలోకి వెళ్లాక ఏడుపు మొదలుపెట్టొద్దు, ఇంటికెళ్లిపోదాం అని పేచీ పెట్టొద్దు. సరేనా?” అన్నాడు.

శీతాకాలం నిజంగానే వచ్చాక కోటయ్య చేతితో లాగే మంచుబండి మీద రెండు మూటలు ఎక్కించాడు. కొన్ని వేట వస్తువులు ఎక్కించాడు. ఇంకా వేరే చిల్లర వస్తువులు వేశాడు. తార కూడా ఒక చిన్న మూట తయారు చేసింది. బొమ్మకి గౌను తయారు చెయ్యడానికి కొన్ని పాత పీలికలు, ఒక దారం బంతి, సూది తీసుకుంది.

‘దీంతో వెండి గిట్టను పట్టుకుంటాను,’ అనుకుంది.

పిల్లిని వదిలిపెట్టడం బాధగానే ఉంది, కాని వేరే మార్గం లేదు మరి. ఆమె పిల్లిని నిమిరి, దాంతో మాట్లాడి అన్నీ వివరించి చెప్పింది.

“తాతా, నేనూ అడవిలోకి వెళుతున్నాం, పిల్లిపిల్లా! నువ్వింటి దగ్గరే ఉండి ఎలుకల్ని పట్టుకో. వెండి గిట్టని చూశాక ఇంటికి వచ్చేస్తాం. నీకు అంతా చెపుతాగా,” అంది.

పిల్లిపిల్ల కొంటె కళ్లతో చూసి గుర్‌మంది

“అవును... స...స్స...రే.”

అలా కోటయ్య, తార బయలుదేరారు. ఇరుగుపొరుగు వాళ్లంతా గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు.

‘ఈ ముసలాడు పిల్లని గారం చేస్తున్నాడు. శీతాకాలంలో చిన్న పిల్లని అడవిలోకి

తీసుకువెళ్లడమా,' అనుకున్నారు.

ఇళ్లు అన్నీ దాటి కోటయ్య, తార వెళుతూ ఉంటే కుక్కలన్నీ గోల చేసి అరవడం, మొరగడం, గందరగోళంగా ఉండటం వాళ్ల చెవినపడింది. ఏదో అడవి జంతువు చొరబడితే మొరిగినట్టుగా అవి మొరుగుతున్నాయి. వాళ్లు వెనక్కి తిరిగి చూశారు. పిల్లి రోడ్డుకు అడ్డంపడి పరిగెత్తుకుంటూ వస్తోంది. అది కుక్కలని చూసి చీదరించుకుంటూ, శాపనార్థలు కుమ్మరిస్తూ వస్తోంది. పిల్లి ఇప్పుడు కొంచెం పెద్దది అయ్యింది, బలం పుంజుకుంది. తన జాగ్రత్త తాను చూసుకోగలదు. దానితో తలపడే కుక్క ఎక్కడా లేదు.

దాన్ని పట్టుకుని ఇంటికి తీసికెళ్లి దిగబెట్టి వద్దామనుకుంది తార. కాని దాన్ని పట్టుకోబోయేసరికి అది అడవిలోకి పరుగెత్తుకెళ్లి రెప్ప మూసి తెరిచే లోపల చెట్టు ఎక్కేసింది. దాన్ని దింపతరం కాలేదు!

"దిగు దిగు," అని తార దాన్ని పిలిచింది, కాని అది లొంగలేదు. ఇక వాళ్ళేం చేస్తారు? ముందుకి సాగిపోవాల్సి వచ్చింది. వాళ్లు వెనక్కి తిరిగి చూస్తే పిల్లి పరిగెత్తుకుంటూ వాళ్ల వెనకే వస్తోంది. ఆ రకంగా వాళ్లు పిల్లితో సహా గుడిసె చేరుకున్నారు.

వాళ్లు గుడిసెలో మకాం పెట్టారు. పిల్లి కూడా వాళ్లతోపాటే ఉంది. గుడిసె, ఆ ప్రాంతం తారకి నచ్చాయి.

"ఇక్కడ బాగుంది," అందామె.

కోటయ్య అవునన్నాడు, "ఆఁ, ఉత్సాహంగా ఉంది."

నెగడు దగ్గర పిల్లి బంతిలా ఉంగచుట్టుకుపోయి గట్టిగా గుర్‌మంది.

"అవును. స...స్స...రిగా అంతే."

ఆ ఏడు శీతాకాలంలో చాలా మేకలు వచ్చాయి, కాని అవి మామూలు మేకలు. కోటయ్య రోజూ ఒకటి రెండింటిని చంపి తెచ్చేవాడు. వాటి మాంసం ఊరేశారు, వాటి తోళ్లు గుట్టగా పేరుకున్నాయి. మంచుబండిలో మోసుకుని ఇంటికి తీసుకుపోలేనంత మాంసం ఊరేశారు. ఇంటికి వెళ్లి ఒక గుర్రాన్ని వెదికి తెచ్చుకోవాలనుకున్నాడు కోటయ్య. కాని వట్టి పిల్లిపిల్లతో తారను వదిలిపెట్టి వెళ్లడం ఎలా? కాని అడవిలో ఉండటానికి తార అలవాటు పడింది. ఆమే ఆ విషయం గురించి చెప్పింది.

"తాతా! ఊళ్లోకి గుర్రం కోసం వెళ్లరాదా? ఊరేసిన మాంసాన్ని ఇంటికి తీసుకెళ్లాలి కదా మనం?"

కోటయ్య ఆశ్చర్యపోయాడు.

"చిన్న పిల్లవైనా ఎన్ని తెలివి తేటలున్నాయి? ఈ ఆలోచన నీకే వచ్చిందా? కాని ఒక్కదానివే ఉండడానికి భయంవెయ్యదూ?"

"భయం దేనికి? ఈ గుడిసె గట్టిగా ఉంటుందని నువ్వే అన్నావు కదా? తోడేళ్లు లోపలికి రాలేవు. అదీగాక అవి ఇక్కడకు రానుకూడారావు. నాకు పిల్లిపిల్ల తోడు ఉంది. నాకేం భయంలేదు. కాని తొందరగా వచ్చెయ్యి," అంది.

కోటయ్య బయలుదేరాడు. పిల్లితో తార అడవిలో ఉండిపోయింది. మేకలను వెతకటానికి కోటయ్య వెళ్లినప్పుడు ఒక్కత్తీ ఉండడానికి అలవాటుపడింది. కాని చీకటిపడే వేళకి కొంచెం బెదురు పట్టుకుంది. పిల్లికేసి చూసింది. అది హాయిగా, తృప్తిగా పడుకుని ఉంది. దాంతో తారకి ఊరట కలిగింది. ఆమె కిటికి పక్కన

కూర్చుని బయట లోయకేసి చూసింది. చిన్న బంతిలాంటిది ఏదో అడవిలోనుంచి గెంతుకుంటూ వస్తోంది. అది దగ్గరకంటా వచ్చింది. తార దాన్ని గుర్తుపట్టింది... మేక. ఆ మేకకి సన్నని కాళ్లు ఉన్నాయి. తల నాజూగ్గా ఉంది. దాని కొమ్ములకు అయిదు చిలవలు ఉన్నాయి.

తార వెంటనే బయటికి పరిగెత్తి వెళ్లింది. కాని అక్కడ ఏమీ కనిపించలేదు. చాలాసేపు చూసి చూసి ఇక ఆఖరికి గుడిసె లోపలకి వెళ్లింది.

"కలగన్నానేమో! ఏదో భ్రమ!" అంది.

"అవును... స...స్స...రిగా అంతే!" అని పిల్లి గుర్‌మంది.

పిల్లిని కూడా తీసుకుని తార మంచం ఎక్కింది. తెల్లవారే దాకా పిలిచినా లేవని గాఢ నిద్రపోయింది. మరో రోజు గడిచింది. కోటయ్య రాలేదు. తారకి ఒంటరిగా పొద్దు పోకుండా ఉంది. కాని ఏడవలేదు. అందుకు బదులుగా పిల్లిని నిమిరింది.

"మరేం బెంగపడకు పిల్లీ! తాత రేపు వస్తాడు! నువ్వే చూస్తావుగా!" అంది.

పిల్లి తన మామూలు పాట పాడింది

"అవును... స...స్స...రిగా అంతే!"

మళ్లీ తార కిటికీ పక్కన చేరి నక్షత్రాలకేసి చూస్తూ కూర్చుంది. ఇక నిద్రపోదామా అనుకుంటూ ఉండగా గుడిసెమీద టప్ టుప్ టప్‌మని చప్పుడవడం వినిపించింది. అవతల గోడమీద టపటప చప్పుడు వినిపించింది. తర్వాత తిరిగి మొదటి గోడమీద వినిపించింది. తర్వాత గుమ్మం మీద. చివరికి కప్పుమీద వినిపించింది. ఆ చప్పుడు గట్టిగా లేదు, గబగబా వేసే అడుగుల చప్పుడులాగా ఉంది.

హఠాత్తుగా తారకి ఒక ఆలోచన తట్టింది. అది నిన్న వచ్చిన మేక అయితే?

ఆమెకి దాన్ని చూడాలని చాలా కోరికగా ఉంది, భయం బెదురూ కూడా ఆమెని ఆపలేకపోయాయి. ఆమె తలుపు తెరిచి బయటకు తొంగి చూసింది. మేక ఉందక్కడ. చాలా దగ్గరగా, చెయ్యి చాస్తే అందేటంత దగ్గరగా ఉంది అది. అది నేలమీద తాడించడానికి ముందు కాలు ఎత్తింది. ఆ కాలిమీద వెండి గిట్ట తళుక్ మంది. దాని కొమ్ములకి అయిదు చిలవలు ఉన్నాయి. ఏం చెయ్యాలో తారకి తోచలేదు. 'మేఁ, మేఁ' అని మామూలు మేకపిల్లని పిలిచినట్టు ఆమె దాన్ని పిలిచింది.

ఆ మేక నవ్వినట్టు వినిపించింది. తర్వాత అది లోయలోకి పరిగెత్తి వెళ్లిపోయింది.

గుడిసెలోకి తిరిగివెళ్లి దీనంతటి గురించి పిల్లికి చెప్పింది తార.

"నాకు వెండి గిట్ట కనిపించింది. దాని కొమ్ములు, దాని గిట్ట కనిపించాయి. అది నేలమీద తాటించడం, విలువైన వజ్రాలు పోగుపడడం మాత్రం కనిపించలేదు. ఈసారి చూపిస్తుందేమో వాటిని," అంది.

పిల్లిపిల్ల తన మామూలు పాట పాడింది:

"అవును. స...స్స...రిగా అంతే."

మూడో రోజు గడిచింది, కాని కోటయ్య జాడలేదు. తార ముఖం ముడుచుకుపోయింది. కొంచెం ఏడ్చింది కూడా. పిల్లితో మాట్లాడాలనుకుంది. కాని పిల్లి ఎక్కడికో వెళ్లిపోయింది. అప్పుడు తారకి నిజంగా భయం వేసింది. పిల్లిని వెతకడానికి వెళ్లింది.

అప్పుడు రాత్రి సమయం. పున్నమి చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. తార చుట్టూ చూసింది. పిల్లి కనిపించింది. అది బీటిమీద కూర్చుంది. దాని దగ్గరలోనే మేక ఉంది. అది కాలు ఎత్తింది. దాని వెండి గిట్ట మెరిసింది.

పిల్లి తల ఆడిస్తోంది. మేక కూడా అలాగే ఆడిస్తోంది, అవి రెండూ మాట్లాడుకుంటూ ఉన్నట్టు. తర్వాత అవి మంచుమీద పరిగెత్తడం మొదలుపెట్టాయి.

మేక అటూ ఇటూ పరిగెత్తి, అప్పుడు ఆగి, గిట్టతో నేలమీద తాటించింది. పిల్లి దగ్గరికి వచ్చింది, మేక దూరం వెళ్లిపోయింది. మళ్లీ ఆగి గిట్టతో తాడించింది. మళ్లీ అలాగే జరిగింది.

అవి చాలాసేపు అలా పరిగెత్తుతూ ఉన్నాయి. తర్వాత దూరంగా వెళ్లి కనిపించకుండా మాయమైపోయాయి. తర్వాత తిన్నగా గుడిసె దగ్గరికి వచ్చాయి.

మేక గుడిసె కప్పుమీదకి ఎగిరి వెండి గిట్టతో తాటించడం మొదలుపెట్టింది. నిప్పురవ్వల్లాగా విలువైన రత్నాలు ఎగిరిపడ్డాయి. అవి ఎరుపు, ఆకుపచ్చ, ఆకాశ నీలం, ముదురు నీలంలాంటి అనేక రంగుల్లో ఉన్నాయి.

అప్పుడు కోటయ్య తిరిగివచ్చాడు. కాని అతను గుడిసెని గుర్తుపట్టలేకపోయాడు. అనేక రంగులతో కాంతులు విరజిమ్ముతూ ఉండే విలువైన రత్నాలు గుడిసెని కప్పేశాయి. పైన మేక వెండి గిట్టతో తాటిస్తూ నుంచుని ఉంది. రత్నాలు రాశులు రాశులుగా పేరుకుంటూనే ఉన్నాయి.

ఇంతలోకి పిల్లి ఉన్నట్టుండి మేక పక్కన మ్యావ్ మ్యావ్‌మంటూ గట్టిగా అరుస్తూ నుంచుంది. తర్వాత పిల్లీ కనిపించలేదు, మేకా కనిపించలేదు.

కోటయ్య రత్నాల పోగులోనుంచి సగం టోపీ నిండా తీశాడు. కాని తార

"తాతా! వద్దు వద్దు అలానే ఉండనీ! పొద్దుట వాటిని అలానే చూడాలని ఉంది నాకు," అని బతిమాలింది.

కోటయ్య సరేనన్నాడు. కాని తెల్లవారే లోపున దట్టంగా మంచు కురిసింది. అన్నీ కప్పడిపోయాయి.

తర్వాత వాళ్లు మంచుని తీసేశారు. కాని వాళ్లకి ఏమీ కనిపించలేదు. అయినా వాళ్లు బాధపడలేదు. ఏమంటే కోటయ్య తీసిన సగం టోపీ రత్నాలు చాలు!

ఆ రకంగా అంతా సుఖంగానే ముగిసింది. పిల్లి మాత్రం మళ్లీ కనిపించలేదు. వెండి గిట్ట మేకా రాలేదు.

మేక పరిగెత్తి వెళ్లిన ఆ లోయలో విలువైన రత్నాలు ఇప్పటికీ ప్రజలకు దొరుకుతూనే ఉన్నాయి. వాటిలో చాలా భాగం ఆకుపచ్చవి. లోకులు వాటిని పచ్చలు అనేవాళ్లు. మీరు ఎప్పుడైనా వాటిని చూశారా?

సోవియట్ భూమి కానుకలు

మంచి పుస్తకం ద్వారా మళ్లీ మీ ముందుకి

టాల్‌స్టాయ్ కథల సెట్ (4 పుస్తకాలు)







సుతయేవ్ కథల సెట్ 1 (4 పుస్తకాలు)



రాడ్లోవ్ బొమ్మల కథలు

సుతయేవ్ కథల సెట్ 2 (4 పుస్తకాలు)







సుతయేవ్ కథల సెట్ 3 (4 పుస్తకాలు)







ఉక్రేనియన్ జానపద గాథల సెట్ (4 పుస్తకాలు)







కథల ప్రపంచం సెట్ (3 పుస్తకాలు)







ఆనంద జీవి



కోడిపిల్ల

బాలల కథలు



నక్క కుందేలు



కిట్టూ కొంటె పనులు



బుల్లి మట్టి ఇల్లు



శ్రీమాన్ మార్జాలం



పాడే ఈక

గుండె కాగడా



వెండిగిట్టె

Silver Hoof by ***P. Bazhov***
Published by
***Raduga Publishers**, 1990*
First Indian Telugu Edition
*by **Manchi Pustakam**, 2012*

వెండి గిట్ట

రచన : పి. బజోవ్

అనువాదం : ఆర్వీయార్

బొమ్మలు : ఎ. ప్లాక్‌సిన్

ప్రచురణ : ఏప్రిల్, 2012

ప్రతుల సంఖ్య : 3000

వెల : ₹ 40/-

ISBN No. 978-81-80153-76-6

ప్రచురణ, ప్రతులకు :
మంచి పుస్తకం
12-13-439,
వీధి నెం. 1, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017.
ఫోను: 94907 46614
email: info@manchipustakam.in
website: www.manchipustakam.in

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
1-9-1126/బి, అజామాబాద్,
హైదరాబాద్-20.
ఫోన్: 040-2767 8411



మంచి పుస్తకం

ISBN 978-93-80153-76-6
9 789380 153766